నమస్తే తెలంగాణ
జోగులాంబ గద్వాల వనపర్తి
5 | మహబూబ్‌నగర్, సోమవారం 5 ఫిబ్రవరి 2024 | JOGULAMBA GADWAL WANAPARTHY

బాలికపై లైంగికదాడి?

తిమ్మాజిపేట, ఫిబ్రవరి 4 : తిమ్మాజిపేట మండలంలోని ఓ గ్రామంలో ఏడేండ్ల బాలికపై అదే గ్రామానికి చెందిన వ్యక్తి లైంగికదాడి చేసినట్లు పోలీసులు తెలిపారు. బాలికను సదరు వ్యక్తి తన ఇంటికి పిలిపించుకొని లైంగికదాడి చేశాడన్నారు. చుట్టుపక్కల వారు గమనించి 100కు డయల్ చేసి సమాచారం ఇచ్చినట్లు ఎస్సై భాస్కర్‌రెడ్డి తెలిపారు. అయితే బాలికను వైద్యపరీక్షల నిమిత్తం నాగర్‌కర్నూల్ దవాఖానకు తరలించారు. పరీక్షల అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని ఎస్సై తెలిపారు.

పోలీసుల విచారణ

అమ్రాబాద్, ఫిబ్రవరి 4 : అమ్రాబాద్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన ప్రబుద్ధుడు బాలికపై లైంగిక దాడికి పాల్పడిన ఘటన ఆదివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ విషయం తెలుసుకున్న చైల్డ్ వెల్ఫేర్ అధికారులు, పోలీసులు సదరు బాలికను బాలసదన్ కేంద్రానికి తరలించారు. ఈ విషయంపై అమ్రాబాద్ ఎస్సై వీరబాబును వివరణ కోరగా లైంగికదాడి ఘటనపై విచారణ చేపట్టినట్లు తెలిపారు. పూర్తి వివరాలు త్వరలోనే వెల్లడిస్తామన్నారు.

కొల్లాపూర్ మండలంలోని ఎల్లూరు శివారులో వరి నాట్లు వేస్తున్న కూలీలు



ఎంజీకేఎల్ఐ ప్రాజెక్టు వ్యూ

యాసంగి సాగేనా!

- కృష్ణానదిలో అడుగంటిన జలాలు
- జోరుగా వరినాట్లు
- కొల్లాపూర్ డివిజన్‌లో 27వేల ఎకరాల్లో సాగు
- తారుమారు కానున్న అధికారుల అంచనాలు

కొల్లాపూర్, ఫిబ్రవరి 4 : ఈ యాసంగి సీజన్‌లో వరి సాగుపై రైతుల్లో అయోమయం నెలకొన్నది. కృష్ణానది నీటిని ఎంజీకేఎల్ఐ ద్వారా నాలుగు వారాల కిందట మోటర్లు పంపింగ్ చేసి ఎల్లూరు, సింగవట్నం, జొన్నలబొగుడ, గుడిపల్లిగట్టు రిజర్వాయర్లకు తరలించారు. అయితే, ఆయా రిజర్వాయర్ల పరిధిలో ఉన్న చెరువులు, కుంటలను మొక్కుబడిగా నింపారు. మూడు వారాలుగా ఎంజీకేఎల్ఐ కాల్వలో నీళ్లు పారడంలేదు. వానకాలంలోనూ కృష్ణానదికి ఎగువ నుంచి వరద రాకపోవడంతో నీటి మట్టం పెరగలేదు. దీంతో రెండు వారాలుగా ఎంజీకేఎల్ఐ ప్రాజెక్టులో మోటర్ల పంపింగ్ నిలిచిపోయింది. ఈ నేపథ్యంలో గతేడాది కంటే ఈ యాసంగిలో వరి సాగు విస్తీర్ణం తగ్గేటట్లు కనిపిస్తున్నది. చెరువులు, కుంటల్లో నీరు అంతంత మాత్రంగానే ఉన్నాయి. ఈ నీళ్లు వచ్చే వేసవిలో పశువులకు దాహం తీర్చనున్నదని రైతులు చెబుతున్నారు. ఉన్న కొద్దిపాటి నీటితో వరి సాగు చేస్తే మూగజీవాలకు దాహం తీర్చడం కూడా కష్టంగా మారుతుందంటున్నారు. గత యాసంగిలో కొల్లాపూర్ డివిజన్‌లోని నాలుగు మండలాల పరిధిలో 30 వేల పైచిలుకు ఎకరాల్లో వరి సాగు కాగా.. ప్రస్తుతం 27 వేల ఎకరాల్లో సాగు చేయనున్నట్లు వ్యవసాయశాఖ అధికారుల అంచనా. అయితే ప్రస్తుతం కొల్లాపూర్ మండలంలో 7 వేల ఎకరాల్లో వరి సాగు కానున్నదని అధికారులు చెబుతున్నారు. ఎల్లూరు రిజర్వాయర్ కింద 800 ఎకరాలు ఆయకట్టు, సింగవట్నం రిజర్వాయర్ ఆయకట్టు కింద ఏడు గ్రామాల పరిధిలో నాన్ ఆయకట్టు కలుపుకొని 4 వేల ఎకరాలు సాగు కావాల్సి ఉండగా.. ఇప్పుడు మాత్రం మొదటి ఆయకట్టు కింద సింగవట్నం, జావాయిపల్లి రైతులు మాత్రమే వరినాట్లు వేసేందుకు సిద్ధమవుతున్నారు. మండలంలో అక్కడక్కడా చెరువుల కింద వరి నాట్లు పెడుతున్నారు. పెంట్లవెల్లి మండలంలో 2 వేలు, కోడేరులో 8 వేలు, పెద్దకొత్తపల్లి మండలంలో 10 వేల ఎకరాల్లో వరి సాగు కానున్నదని అధికారుల అంచనా. ప్రస్తుతం నీటి లభ్యత లేకపోవడంతో యాసంగి సాగుపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఒక పక్క కృష్ణానదిలో నీరు అడుగంటిపోవడం, చెరువులు, కుంటల్లో అంతంత మాత్రంగానే నీరు ఉండడంతో అధికారుల అంచనాలు తలకిందులు కానున్నట్లు కనిపిస్తున్నది. ప్రస్తుత పరిస్థితులను బట్టి చూస్తే కొల్లాపూర్ డివిజన్ మొత్తంలో ఈ యాసంగిలో 15 వేల ఎకరాల్లోపే వరి సాగు కానున్నది. సుమారు 12 వేల ఎకరాల్లో సాగు విస్తీర్ణం తగ్గనున్నదని రైతులు అంచనా వేస్తున్నారు. ఇదిలా ఉండగా మార్కెట్‌లో బియ్యం ధరలకు రెక్కలొచ్చాయి.

వరిమడిలో మందులు చల్లుతున్నరైతు

యాసంగి పంట సీజన్ పూర్తయిన తరువాత బియ్యం ధరలు మరింతగా పెరిగే అవకాశం ఉన్నది.

ముందుగానే నదిలో అడుగంటిన నీరు..

ఈ వానకాలంలో కృష్ణానది కూడా పూర్తి స్థాయిలో నిండకపోవడం, దిగువన శ్రీశైలం ప్రాజెక్టు ద్వారా సాగర్‌కు నీరు విడుదల కావడం, అలాగే ఎగువన సంగమేశ్వరం సమీపంలో పోతిరెడ్డిపాడు, ముచ్చుమర్రి లిఫ్ట్‌ల నుంచి నదీ జలాలను రాయలసీమకు తరలించుకుపోవడంతో నది అడుగంటిపోయింది. ఐదారేండ్లలో ఇలాంటి పరిస్థితులు కృష్ణానదికి దాపురించలేదు. నదిలో ఇప్పుడున్న నీటి పరిస్థితి వాస్తవంగా మార్చి, ఏప్రిల్ నెలల్లో ఉండాలి. ఇలాంటి పరిస్థితుల్లో యాసంగిలో వరి సాగుపై రైతులు ఎటూ తేల్చుకోలేకపోతున్నట్లు తెలుస్తున్నది.

కల్వకుర్తి కథ కంచికేనా?

- కాంగ్రెస్ ప్రభుత్వ అనాలోచిత చర్య
- తెలంగాణ హక్కులు కేంద్రానికి తనఖా
- ఎంజీకేఎల్ఐని కేఆర్ఎంబీకి అప్పగిస్తే బీళ్లుగా మాగాణులు
- శ్రీశైలం, పాలమూరు ప్రాజెక్టులపైనా ప్రభావం
- విద్యుదుత్పత్తి, సాగు, తాగునీటికీ ముప్పు
- సీఎం రేవంత్ మాటలపై తెలంగాణవాదుల అభ్యంతరం

నాగర్‌కర్నూల్, ఫిబ్రవరి 4 (నమస్తే తెలంగాణ) : కృష్ణానది జలాల్లో హక్కులు కోల్పోయే పరిస్థితులను కాంగ్రెస్ తీసుకొస్తున్నది. కేఆర్ఎంబీకి కృష్ణా నది ఆధారిత ప్రాజెక్టులను అప్పగించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలోని ప్రభుత్వం సిద్ధమవ్వడంతో రాబోయే రోజుల్లో పాలమూరులోని పల్లెల్లో కరువు నెలకొననున్నది. కేంద్రం ఆధీనంలోకి శ్రీశైలం రిజర్వాయర్‌తోపాటుగా జలవిద్యుత్ కేంద్రం, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల, ఎంజీకేఎల్ఐ ప్రాజెక్టులు చేరనున్నాయి. ఫలితంగా తెలంగాణ ప్రభుత్వం హక్కులను కేంద్రానికి తనఖా పెట్టడంతో సమైక్య పాలనలోని చేదు ఫలితాలు రాబోయే కాలంలో ఎదురవుతాయన్న ఆందోళన తెలంగాణవాదుల్లో నెలకొన్నది.

ఉమ్మడి పాలమూరు జిల్లాకు చెందిన సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కృష్ణానదిపై నిర్మించిన తెలంగాణ ప్రాజెక్టుల హక్కులను కేంద్ర ప్రభుత్వానికి దాఖలు చేయనున్నది. దీంతో రాబోయే రోజుల్లో పాలమూరులో కృష్ణానది ఆధారంగా నిర్మించిన ప్రాజెక్టులపై సర్వ హక్కులను కోల్పోయే పరిస్థితులు ఏర్పడబోతున్నాయి. సమైక్య పాలనలో వాటిల్లిన నీళ్ల పంపిణీలో జరిగిన అన్యాయాలను కేసీఆర్ ప్రభుత్వ హయాంలో దాదాపుగా పూర్తి చేసింది. ఇందులో భాగంగా కృష్ణానదిపై నిర్మించి దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న నాగర్‌కర్నూల్ జిల్లాలోని ఎంజీకేఎల్ఐని ఏడాదిన్నరలోనే పూర్తి చేసి 2016 నుంచి సాగునీళ్లు అందించింది. దీంతో బీళ్లుగా ఉన్న జిల్లాలోని నాగర్‌కర్నూల్, కొల్లాపూర్ తోపాటు కల్వకుర్తి చివరి ఆయకట్టుకు, అచ్చంపేట, జడ్చర్ల, వనపర్తిలోని పలు మండలాలకు సాగునీళ్లు అందిపచ్చని మాగాణుల్లా మారాయి. దీనివల్ల నాగర్‌కర్నూల్ జిల్లాలో ఏడాదిలో దాదాపుగా 4లక్షల ఎకరాల విస్తీర్ణంలో సాగవుతున్న పంటలు దాదాపుగా 9లక్షల ఎకరాలకు చేరడం గమనార్హం. దీనికి తోడుగా దక్షిణ తెలంగాణ వరప్రదాయినిగా నిలిచే పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని కేసీఆర్ రాష్ట్ర నిధులతోనే పూర్తి చేశారు. ఇందులో భాగంగా నార్లాపూర్ రిజర్వాయర్‌ను గతంలో సీఎం హోదాలో కేసీఆర్ ప్రారంభించగా వట్టెం, ఏదుల రిజర్వాయర్లు దాదాపుగా పూర్తయ్యాయి. కృష్ణానదికి నీళ్లు రాక, ఎన్నికలు రావడంతో ఈ రిజర్వాయర్లు ప్రారంభానికి నోచుకోలేదు. ఇక భీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్‌లో పెండింగ్ పనులనూ గత పదేండ్లలో పూర్తి చేసింది. ఇలా ఏడాదిలో రెండు పంటలు పండుతూ, చెరువులు, కుంటల్లో నీళ్లతో మత్స్య సంపద వృద్ధి చెందింది. పశువులకు గ్రాసం కొరత కూడా తీరింది. నాటి గంజి కేంద్రాలు కనుమరుగయ్యాయి. గత పదేండ్లలో ప్రజల జీవన ప్రమాణాలు, తలసరి ఆదాయమూ పెరిగింది. ఇవన్నీ పాలమూరు ప్రజల కండ్ల ముందు సాక్షాత్కరిస్తూనే ఉంటే సీఎం రేవంత్ పాలమూరులో ఒక్క ప్రాజెక్టు కూడా కేసీఆర్ ప్రభుత్వం పూర్తి చేయలేదని, ప్రారంభించలేదని చెప్పడం విస్మయానికి గురిచేస్తోంది. ఈ క్రమంలో కృష్ణానదిలో తెలంగాణ వాటా తేల్చేందుకు గతంలో కేసీఆర్, నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం కేంద్రానికి లేఖలు రాసినా స్పందించ లేదు. దీనిపై బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళనలు సైతం నిర్వహించింది. ఇదిలా ఉంటే అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కృష్ణానది ప్రాజెక్టులను కేంద్రానికి అప్పగించేందుకు సిద్ధమవ్వడం పాలమూరు ప్రజల్లో ఆందోళన రేకెత్తిస్తున్నది. దీనివల్ల తెలంగాణ ప్రభుత్వ హక్కులు కేంద్రానికి దాఖలవుతాయి. కృష్ణానదిలో గ్లాసు నీళ్లు కావాలన్నా కేంద్రం అనుమతి తీసుకోవాల్సిన దుస్థితి ఏర్పడనున్నది. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఏపీలోని జగన్ ప్రభుత్వానికి అనుకూలంగా ఉన్నది. ఫలితంగా కృష్ణా నీళ్లను ఆంధ్రాకు గతంలో మాదిరిగా ఆర్డీఎస్‌ను పగులగొట్టి, దొంగతనంగా కాకుండా దర్జాగా తరలించుకెళ్లే పరిస్థితులు రానున్నాయి. ఇదే జరిగితే శ్రీశైలంలో జలవిద్యుత్ ఉత్పత్తిపై, మిషన్ భగీరథ ద్వారా నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, నారాయణపేట, రంగారెడ్డి, వికారాబాద్, వనపర్తి జిల్లాల్లోని 19 మున్సిపాలిటీలు, 88 మండలాలు, 4,427 గ్రామాలకు తాగునీరు కావాలన్నా కేంద్ర ప్రభుత్వాన్ని దేహీ అనాల్సిన దుస్థితి రానున్నది. ఇలా కృష్ణా జలాల్లో వాటా హక్కులు అడగడం మరిచిపోయి తాగునీటికీ తండ్లాడే పరిస్థితులు ఎదురవుతాయన్న ఆందోళన తెలంగాణవాదులు వ్యక్తం చేస్తున్నారు. ఆరు గ్యారెంటీల అమలు ఆచరణలో విఫలమవుతూ ప్రజల విమర్శలకు గురవుతున్న నేపథ్యంలో కృష్ణానదిలో నీటి వాటా తేల్చని, పాలమూరు పథకానికి జాతీయ హోదా ఇవ్వని కేంద్రంతో రేవంత్ జత కట్టడం మరింత ఆగ్రహానికి గురి చేస్తున్నది.

గుడిపల్లి రిజర్వాయర్

- అచ్చంపేట ఏరియా దవాఖాన పారిశుధ్య సిబ్బంది ఆందోళన

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

అచ్చంపేట, ఫిబ్రవరి 4 : అచ్చంపేట ప్రభుత్వ ఏరియా దవాఖానలో పనిచేస్తున్న పారిశుధ్య సిబ్బంది, సెక్యూరిటీ గార్డులకు నాలుగు నెలలుగా వేతనాలు చెల్లించడం లేదు. దీంతో పెండింగ్ వేతనాలు చెల్లించాలని ఆదివారం ఉదయం దవాఖాన ఎదుట పారిశుధ్య సిబ్బంది ఆందోళన ని ర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాలుగు నెలలుగా వేతనాలు ఇవ్వకుంటే తమ కుటుంబాలను ఎలా పోషించుకోవాలని ఆవేదన వ్యక్తం చేశారు. ఏజెన్సీ నిర్వాహకులు జీతాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని, వేతనాలు చెల్లించకుంటే పనులు నిలిపివేస్తామని హెచ్చరించారు. సీఐటీయూ నాయకులు మద్దతు తెలిపారు. విషయం తెలుసుకున్న దవాఖాన సూపరింటెండెంట్ ప్రభు అక్కడికి వచ్చి ప్రభుత్వం నుంచి బిల్లులు రాకపోవడంతో వేతనాలు చెల్లించలేదని, ఏజెన్సీ వారితో మాట్లాడుతామని హామీ ఇవ్వడంతో సిబ్బంది ఆందోళన విరమించారు.

అచ్చంపేట ఏరియా దవాఖాన ఎదుట ఆందోళన చేస్తున్న పారిశుధ్య సిబ్బంది

హోటల్ వద్ద ప్రజలతో మాట్లాడుతున్నమా జీ మంత్రిశ్రీని వాస్‌గౌడ్, చిత్రంలో ఎంపీ మన్నె

కేసీఆర్ సర్కారే బాగుండె..

- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌తో ముచ్చటించినజ నం

మహబూబ్‌నగర్ అర్బన్, ఫిబ్రవరి 4 : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత తమ సమస్యలను ఎవరూ పట్టించుకోవడం లేదని.. కేసీఆర్ ప్రభుత్వమే బాగుండేది అని పాలమూరువాసులు చెబుతున్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని కోయిలకొండ ఎక్స్‌రోడ్, హన్వాడ మండలకేంద్రంలో ఆదివారం మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పర్యటించారు. సామాన్య ప్రజలతో కలిసిపోయి ముచ్చటించారు. హోటల్‌లో చాయ్ తాగుతూ.. బజ్జీలు తింటూ వారిలో ఒకరిగా క్షేత్ర స్థాయిలో పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. రెండు నెలల నుంచి టైంకు పింఛన్ రావడం లేదని.. కేసీఆర్ సార్ ఉన్నప్పుడు సమయానికి వచ్చేదని.. పైసల కోసం ఎవరి వద్ద చేయి చాచే వాళ్లం కాదన్నారు. వ్యవసాయానికి కరెంట్ కూడా సరిగ్గా ఇవ్వడం లేదని.. పంటలకు నీరు సరిపోవడం లేదని వాపోయారు. గ్రామాల్లో తాగునీటి సమస్య మొదలైందని.. బీఆర్ఎస్ హయాంలో రోజూ నీళ్లు వచ్చేవన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నమ్మి మోసపోయామని, కేసీఆర్ ప్రభుత్వమే బాగుండేదని చెప్పడంతో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మళ్లీ మంచి రోజులు వస్తాయని వారికి భరోసా కల్పించారు. ఆయన వెంట ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి కూడా ఉన్నారు.

అంబేద్కర్ అందరివాడు

- ఆర్టికల్ 3 ప్రకారం తెలంగాణ సాధించుకున్నాం
- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్
- అంబేద్కర్, జ్యోతిరావుపూలే విగ్రహాలు ఆవిష్కరణ
- హాజరైన ఎంపీ మన్నె, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

హన్వాడ, ఫిబ్రవరి 4 : రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కొందరివాడు కాదు అందరివాడు అని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఆదివారం మండలంలోని పెద్దదర్పల్లిలో బీఆర్ అంబేద్కర్, మహాత్మాజ్యోతిరావుపూలే విగ్రహాలను ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డితో కలిసి మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని ఆర్టికల్ 3 ప్రకారం సాధించుకున్నామన్నారు. చిన్న రాష్ట్రాలతోనే అభివృద్ధి సాధ్యమని అంబేద్కర్ రాజ్యాంగంలో పొందుపర్చారని గుర్తు చేశారు. రాజ్యాంగంలో పొందుపర్చిన హక్కులు, రిజర్వేషన్ల వల్లనే బడుగు, బలహీన వర్గాల వారు ప్రజాప్రతినిధులు అవుతున్నారని, ఉద్యోగావకాశాలు పొందుతున్నారని పేర్కొన్నారు. దళితులను ఏబీసీడీగా వర్గీకరించాలని కేసీఆర్ ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి పంపినా కేంద్రం పట్టించుకోలేదన్నారు వర్గీకరణతోనే దళితులు అన్ని విధాలుగా అభివృద్ధి సాధించగలుగుతారని, తాము ఎస్సీ వర్గీకరణకు కట్టుబడి ఉన్నామని ప్రకటించారు. అనంతరం ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ మహనీయులను ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకొని వారి బాటలో నడవాలన్నారు. రాజ్యాంగం వల్లే తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకోగలిగామని వివరించారు. ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ మహాత్ములు జ్యోతిరావుపూలే, అంబేద్కర్ జాతి నిర్మాతలని వారిని అందరూ స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. మహనీయులు అందించిన హక్కులతో విద్యావ్యవస్థను బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని, పార్టీలకు అతీతంగా గ్రామాలను అభివృద్ధి చేస్తామన్నారు. ప్రతి గ్రామంలో అంబేద్కర్ విగ్రహాలను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన విలేకరి తిరుపతయ్యను పరామర్శించారు. కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ మాజీ చైర్‌పర్సన్ రజినీసాయిచంద్, ఎంపీపీ బాలరాజు, మాజీ సర్పంచ్ వెంకన్న, ఎంపీటీసీ మణెమ్మ, మాజీ ఉపసర్పంచ్ ప్రవీణ్, సింగిల్ విండో చైర్మన్ వెంకటయ్య, వైస్ చైర్మన్ కృష్ణయ్యగౌడ్, కరుణాకర్‌గౌడ్, కృష్ణయ్యతోపాటు అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

విగ్రహాలను ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే యెన్నం

గుప్తనిధుల కోసం తవ్వకాలు

కోడేరు, ఫిబ్రవరి 4 : కోడేరు శివారులోని లక్ష్మాపూర్ ఆంజనేయస్వామి ఆలయ పరిసర ప్రాంతంలో గుర్తు తెలియని దుండగులు గుప్తనిధుల కోసం తవ్వకాలు జరిపారు. కోడేరు మండలకేంద్రానికి సుమారు మూడు కిలోమీటర్ల దూరంలో 150 ఏండ్ల కిందట లక్ష్మాపూర్ గ్రామంలో 50 ఇండ్లు 200లకు పైగా జనాభా ఉండేది. అప్పట్లో ఎత్తం గట్టు నీడ గ్రామంపై పడుతుండడంతో కీడు జరిగి ప్రజలు మృత్యువాత పడుతున్నారనే మూఢనమ్మకంతో గ్రామాన్ని వదిలేశారు. దీంతో లక్ష్మాపూర్‌లో ఇండ్లన్నీ శిథిలమయ్యాయి. కేవలం ఆలయాలు, విగ్రహాలు, పూర్వీకులు ఉపయోగించిన వస్తువుల ఆనవాళ్లు మాత్రమే ప్రస్తుతం దర్శనమిస్తున్నాయి. అయితే అక్కడ ఆంజనేయస్వామి ఆలయానికి సంబంధించిన కొంత భూమి ఉన్నది. దానితోపాటు ఇండ్లు శిథిలమైపోగా మిగిలిన ఖాళీస్థలంలో గుప్తనిధులు ఉన్నట్లు ప్రచారంలో ఉంది. దీనిని పసిగట్టిన కొందరు దుండగులు రోజుల కిందట ఆ పరిసర ప్రాంతంలో జేసీబీ సాయంతో తవ్వకాలు చేపట్టగా.. రెండు చోట్ల తవ్విన ఆనవాళ్లు ఉన్నాయి. తవ్వకాలు జరిపిన ప్రదేశంలో నిమ్మకాయలు కుంకుమ, పసుపు వేసి ఓ పెద్ద రాయిపై మంత్రాలు చేసినట్లు కనిపిస్తున్నది. ఈ విషయమై ఆరా తీయగా రెండేండ్ల కిందట పక్కనే పొలం కొనుగోలు చేసిన వ్యక్తితోపాటు మండలానికి చెందిన ఓ ప్రజాప్రతినిధి భర్త, మరికొందరు కలిసి ఈ తవ్వకాలను జరిపినట్లు తెలుస్తున్నది.

ఖిల్లా యువకుడి సాహసం

- సెల్‌ఫోన్‌లో చిరుత సంచారం రికార్డు
- స్పందించిన ఫారెస్ట్ అధికారులు
- చిరుత పులిని బంధించేందుకు బోను ఏర్పాటు
- యువకుడికి అభినందనలు

ఖిల్లాఘణపురం, ఫిబ్రవరి 4 : కొన్ని రోజుల నుంచి ఖిల్లాఘణపురం మండల కేంద్రంతోపాటు చుట్టు పక్కల గ్రామాల్లో చిరుతపులి సంచరిస్తుందని రైతులు, గ్రామస్తులు భయభ్రాంతులకు గురవుతున్నారు. పులి సంచరిస్తుందని ఫారెస్ట్ అధికారులకు చెప్పినా స్పందన లేదు. కానీ రెండు రోజుల కిందట మండల కేంద్రానికి చెందిన ఒక రైతుకు సంబంధించిన మేకల మంద నుంచి ఒక మేకను చిరుత పులి ఎత్తుకెళ్తున్న దృశ్యాలు చూసి అవాక్కయ్యారు. ఈ విషయాన్ని మేకల కాపరి బంధువైన జంగం రాములుకు చెప్పడంతో ఆ యువకుడు ధైర్యంగా ముందుకు వెళ్లి చాలా జాగ్రత్తగా చిరుత పులిని గమనించాడు. చిరుతపులి మేకను చంపి తినే సమయంలో తాను కొన్ని అరుపులు చేయడంతో చిరుతపులి మేకను వదిలేసి గుట్టల్లోకి వెళ్లింది. దీనిని గమనించి సదరు యువకుడు తన సెల్‌ఫోన్‌ను ఒక చెట్టుకు బిగించి కెమెరా ఆన్ చేసి తాను అక్కడి నుంచి తన పొలంలోకి వెళ్లిపోయాడు. దాదాపు గంటన్నర తరువాత చిరుతపులి ఉన్న ప్రదేశంలో పెట్టిన సెల్‌ఫోన్‌ను తీసుకువచ్చాడు. ఫోన్‌లో బంధించిన వీడియో ఆధారంగా శనివారం ఫారెస్ట్ అధికారులు స్పందించి చిరుతను బంధించేందుకు బోను ఏర్పాటు చేశారు. దీంతో మాజీ సర్పంచ్ వెంకటరమణ జంగం రాములును శాలువాతో సన్మానించి ప్రోత్సాహకంగా రూ.వెయ్యి నగదును అందజేశారు. కొంతకాలంగా రైతులు, ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఫారెస్ట్ అధికారులకు చిరుతపులినా, హైనానా అని సందిగ్ధ పడుతున్న సమయంలో రాములు వీడియో ఆధారంగా చిరుత పులి అని నిర్ధారించుకొని ఫారెస్ట్ అధికారులు చర్యలు తీసుకున్నారు. దీంతో ప్రజలు సదరు యువకుడి ధైర్యసాహసాలను మెచ్చుకుంటున్నారు.

రైతులు, ప్రజలు జాగ్రత్తగా ఉండాలి..

ఖిల్లాఘణపురం తండా వెనుక ఉన్న గుట్టపై చిరుతపులి సంచరిస్తుందని, దానిని బంధించేందుకు బోను ఏర్పాటు చేసినట్లు ఖిల్లా ఎస్సై శ్రీహరి, ఫారెస్ట్ అధికారులు ప్రజలకు సూచించారు. బోను చుట్టుపక్కల ప్రజలు సంచారం చేయవద్దని, అలికిడి ఉంటే బోను ఉన్నచోటికి చిరుతపులి రాదని తెలిపారు. ప్రజలు బోను చుట్టుపక్కలకు కానీ, గుట్టపైకి కానీ వెళ్లకూడదని హెచ్చరించారు.



బోను ఏర్పాటు చేసిన ప్రదేశంలో యువకుడిని సన్మానిస్తున్న గ్రామస్తులు